# సీటు

ఇంటి ముందు ఏర్పాటు చేసిన షామియాన కింద శాసనసభ్యుడు రంగారావు శవాన్ని జనం దర్శించుకోవడానికి వుంచారు. రాజకీయ నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు ప్రజలు బారులు తీరి దర్శించుకుని, ఆయన చేసిన మంచిని మననం చేసుకుంటు కదులుతున్నరు.

" మంచి మనిషి " అక్కడ నిలుచున్న వాళ్ళలో ఒకరు

" రాజకీయ చతురుడు " పార్టీ మనిషి

" అందర్నీ ఆప్యాయంగా పలుకరించేటోడు " ప్రతిపక్షపు మనిషి

" ఎవర్నీ అగౌరవపర్చిన ఇడుకాడు లేవు " అంటు కొందరు మహిళలు.

" రెండు దఫాలుగా శాసనసభ్యులై ఎవరికి ఏ ఉద్యోగం ఇప్పించిండని, చస్తే చచ్చిండు మరొకరొస్తరు. ఈయన చేయలేని పనులు పవర్ ఉన్న ఏ కొత్త వ్యక్తన్న చేస్తాడు " అంటు యువకుల గుసగుసలు.

" ఎవరు ఏం చేసిన ఈరోజుల్లో చేయి తడపాల్సిందే పనిపట్టేది " అంటు ఆయన చుట్టు తిరిగిన ఉద్యోగుల తర్జనా భర్జనలు.

" అయిన ఏంచేసినా చేయకపోయిన ప్రతి పండుగకు ఇనాం ఇచ్చేటోడు. తిన్నోళ్ళం ఎట్లా మరిచిపోతం " అని మున్సిపల్ వర్కర్ల తలపోత.ఆయన మొదట మున్సిపల్ ఛైర్మన్‌గా చేసింది గుర్తు చేసుకుంటు.

" అప్పుడప్పుడు తెల్లవారు జామున నడిచి వస్తు ఎక్కడ కనిపిస్తే అక్కడా చాయపైసలు ఇచ్చేటోడు " అని రోడ్డు ఊడిచేవాళ్లు తమ తమ జ్ఞాపకాలను పొరకలతో పాటె బుజాన వేసుకుని కదులుతున్నరు. శవం దగ్గర కనిపించకపోయె సరికి 'ఎక్కడ ఎక్కడ' అని వచ్చినవాళ్ళ కళ్లు వెతుకుతున్నయి. ఆయన భార్య కైకను.

" అయ్యో తెలవదా ఆసుపత్రిలో ఏసింద్రటగదా " అంది పాల బాలమ్మ

" ఎందుకన్నట్టు " చూసారు మిగతావాళ్లు.

" అమె రాత్రి నుండి మాటపడిపోయి కోమాలోకి పోతే గ్లూకోసులు ఎక్కిస్తున్నరట " అంది ఆకు కూరల అచ్చమ్మ.

" అట్లానా " అంటు అంగలార్చుతున్నరు. అక్కడి ఆడక్కలు.

" పార్టీ పెద్దలు వొచ్చి పోతున్నారు. వ్యాపారస్తులు వచ్చి దీర్ఘశ్వాస వదిలి వెళుతున్నరు.
" ఆవును ఎట్లా చచ్చింది " పదుగురి ప్రశ్నలు.
" చావలేదు, చంపినట్టుంది " అంటు ఆవార్డు మున్సిపల్ వర్కర్ తన సందేహాన్ని తెలియపరిచిండు.
" అవును తలపగిలి మెదడు బయటికొచ్చింది" అన్నడు వార్డు కౌన్సిలర్.
" ఎవరు కొట్టిచంపారట" మీడియావాళ్ల ప్రశ్నలు.
" తెలవదు, మధ్యరాత్రి జరిగిపోయిందట " శానటరీ ఇన్స్‌పెక్టర్ వాఖ్య.
" ఇంట్లో లైట్లు వెలుగుతుంటే గేటు తెరిచి, తలుపు తట్టి పిల్చి లోపలికెళ్లి చూసే సరికి, రక్తపుమడుగులో రావు గారు! కొంచం దూరంలో స్పృహ లేకుండా పడివున్న ఆయన భార్య. వెంటనే ఆమె ముఖం మీద నీళ్లు చల్లిన, ఆమె లేచి కూర్చుంది. ఏం జరిగిందని అడిగిన. ఆమె జవాబు చెప్పకుండానే మళ్లి బేహోష్ అయిపోయింది " అని ముగించాడు గూర్కతనకు తెలిసింది చెప్పి అంతకంటే నాకేమి తెలియదన్నట్టు చూస్తు.
" ఆ తరువాత ఏం జరిగింది " పదుగురి ప్రశ్నలు.
" పోలీసు స్టేషన్ వెళ్ళి చెప్పగానే వాళ్ళొచ్చిండ్రు. నేను నా పనిమీదనే వెళ్ళిపోయినంతే " అంతవరకె నేను చూసిన, మొత్తం మీద అది హత్యే అని మాత్రం చెప్పగలను. అన్నడు నిశ్చయంగ చూస్తు.
" మిగతాది నేను చెపుత " అంటు ఓ కానిస్టేబుల్ ముందుకొచ్చిండు.
" చెప్పండి " అని అతనివైపు తలలు తిరిగినయి.
" స్పృహతప్పివున్న మేడమ్‌ను హాస్పత్రిలో చేర్చాము. ఆమెకు ఇంకా స్పృహ రాలేదు. ఆమెకు స్పృహ వస్తేకాని ఏం జరిగిందో చెప్పదు. " అన్నడు పోలిసు మాములుగా.
" అక్కడ ఆమె వచ్చిరి, వచ్చిరి, కర్రలతోటి, వచ్చిరి. గొడ్డండ్లతోటి వచ్చిరి. నన్నేమనొద్దు, నా భర్తనేమనొద్దు. ఎవరికే మన్యాయం చేసిండని అంటుందట " హాస్పిటల్ నుండి వచ్చిన వ్యక్తి తాను విన్నది చెప్పిండు.
" పాపం షాక్ తిన్నట్టుంది. తన భర్తను తన కళ్లముందే కొట్టి చంపింది చూసి తట్టుకోలేకపోతుంది" అంది అక్కడే నిలుచున్న పాలమ్మె బాలమ్మ.

" పాపం ఆమె మహామంచి తల్లి. ఈ దొర రాజకీయాలు నడిపిస్తు ఎప్పుడు ఏది చెపితే అప్పుడు ఆ పనిచేస్తువచ్చింది. ఎన్నికలప్పుడు ఇళ్ళిల్లు తిరిగి బొట్టుపెట్టి ఓటు అడిగి వస్తూవుండేది. రాత్రనక పగలనక వచ్చిపోయే వాళ్లకు వడ్డనలు! చేస్తువుండేది. ఆమె ఎన్నడు సుఖపడ్డదని అంటు ఆంగలార్చింది. ఆకు కూరల అచ్చమ్మ.

" భర్త ప్రజల మనిషి అన్నపుడు భార్యకు వంటలు వార్పులు తప్పవు " అంది మరో స్త్రీ. ఆమె ఆయన పార్టీ కార్యకర్త వార్డ కౌన్సిలర్ కూడా.

" పండుగలకు పబ్బాలకు అమ్మకు చిన్న చేయిరాకపోయేది. ఆమెకు ఏం కావద్దు " అంది చాకలి మంగమ్మ.

*

ఈలోగ పార్టీ ఆఫీసులో అత్యవసర సమావేశం జరిపి శవంపై పార్టీ జండా కప్పాలని, అధికార పార్టీ శాసనసభ్యుడు కనుక ప్రభుత్వ లాంచనాలతో దహనం చేయాలని నిర్ణయించారు. ఖాలి అయిన స్థానాన్ని ఎవరికివ్వాలో నిర్ణయించడానికి మరో సమావేశం జరపాలని తీర్మానించారు. శవయాత్రకు సన్నాహాలు జరుగుతున్నయి. రాష్ట్రపార్టీ అధ్యక్షులు, వర్కింగ్ కమిటి సభ్యులు వచ్చి తమ తమ శ్రద్ధాంజలి తెలుపుకొంటున్నరు. శాసన సభా స్పీకర్, ఫ్లోర్ లీడర్లు వచ్చి పోతున్నరు. పోతు పోతు హస్పత్రికి వెళ్లి భార్య ఆరోగ్య పరిస్థితిని చూసి వెలుతున్నరు. ఆమెకు ఇంకా స్పృహరాలేదు. త్వరగా స్పృహ తెప్పించి అంత్యక్రియల్లో పాల్గొని చివరి వీడుకోలు పలికేటట్టు చూడవల్సిందిగా హస్పత్రి వర్గాలను ఆదేశించి వెలుతున్నరు. డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తువున్నరు. ఉన్న ఒక్క కొడుకు అమెరికా నుండి చావుకు రాలేదు. తలకొరివి ఎవరూ పెట్టాలి ఓ సమస్య అయింది. ఏ సమస్య అయిన ఎంతో కాలం ఉండదు కదా.

*

మున్సిపల్ ఛైర్మన్ రంగారావు మంచి మనిషి. అందరితో కలివిడిగాక కలిసి తిరుగుతుండేవాడు టౌనంతా తిరుగుతు ఎదురైన ప్రతి వ్యక్తిని పలకరించే వాడు. మార్నింగ్ వాకప్పుడు తప్ప ఎప్పుడు ఆయన

వెంట నలుగురు ఉండేవారు.

ఓ రోజు తెల్లవారుజామున నగర శివారువైపు వాకింగ్ వెలుతువుంటె ఎదురుగ ఓ నడీడు స్త్రీ, వాకిలి ఊడ్చేది ఆపి ఎదురొచ్చి చేతులు జోడించి “ అయ్యా కాస్త మా సందును చూడండి పై నుండి, పక్కనుండి వచ్చే నీరు ఆగి పెద్దమడుగైంది. పొద్దున్నేలేస్తే పందులు పోర్లాడుతుంటయి. దోమలే దోమలు!” అంది వినయంగా.

‘ చూద్దాంపద ’ అన్నట్టు చూసాడు.

ఆమె ఇంటి పక్కవున్న మడుగువైపు నడిచింది, రావు ఆమెను అనుసరించి చూడగా మడుగు; ఆ మడుగులో పడుకున్న పందులు వీళ్ల రాకనుచూసి లేవగానె ఆ బురద నీటిపై దోమల గుంపు గుయ్ మంటు ఓ సారి లేచి తిరిగి వాలినయి. అక్కడంతా ముక్కులు పలిగే కంపు వాసనె వాసన.

“ రాత్రంతా నిద్రలుండవు. జెర ఎట్టనన్న ఈ నీరు పోయె కాలువను కట్టిస్తే పుణ్యముంటది ”అంది ఆశగ.

“ మెదడు వ్యాదులప్పుడు భయ భయంగ బతికినం ” అంది మళ్ళీ తానే.

“ ఈ వార్డుమెంబర్ లూసిమ్మ గారనుకుంట. ఆమెకు చెప్పండి కౌన్సిల్‌లో పెట్టిస్తది ” అన్నడు ముక్తసరిగ.

“ ఎన్నోసార్లు చెప్పిన ఆమె పట్టించుకోవడం లేదు ” అంది నిరాశగ చూస్తు.

“ సరె ఈసారి నేను చూస్తాను. ఆమెకైతే మీరు చెప్పండి, ఆమెను గుర్తుచేయమనండి ” అంటు కదులుతున్నపుడు కుక్క ఓ పందిని తరుముకురాగ, అది వాళ్ళ ముందునుండె పరుగెత్తింది.

పంది పరుగును చూసి ఇద్దరు పక్కకు జరుగగ. వాకిట్లో అది విదిల్చిన బురద మరకలు.

“ టీ ఏమన్న ” అంటు ఆయన వెనకాల నడుస్తు అడిగింది.

“ లేదమ్మ నే టీ తాగను ” అన్నడు రావు.

“ ఇదే మా ఇల్లు ” అంటు ఆగి చూపింది.

ఆ వాకిట్లో అప్పుడప్పుడే ముగ్గు పరిచినట్లుంది. ఆ ముగ్గు ఓ ప్రత్యేకంగా ఉంది.

‘ ఎవరు వేసింద్రు ఈ ముగ్గు!’ అనుకుంటు కాసేపు ఆగి చూస్తు ఉండు.

కిర్రుమని ఆ ఇంటి తలుపులు ఓసారి తెరుచుకున్నాయి. తలుపుల మధ్య ఓ లేత ప్రౌఢ.

ముగ్గుమీది చూపులు తెరుచుకున్న తలుపుల మీద వాలినయి. తలుపులు వెంటనే మూసుకున్నాయి.

" ఆమే నా కూతురు. దానికి బహు సిగ్గు " అంది పరిచయపలుకుల్లో.

" మీరు మొదటి నుండి ఇక్కడేనా, మీ పేరు?" అని రావు వివరాలకోసం కదిలించాడు.

" నా పేరు రంగనాయకి మాది అసలు కోదాడ. మా ఆయన పోయినంక ఇక్కడికొచ్చినం" అంది.

" ఇక్కడ మీకెవరన్న తెలిసినోళ్లు వున్నర?" అడిగిండు.

" ఎవరు లేరు. మా వారు సర్వీసులోనే పోయారు. ఒక్కతె కూతురు అప్పటికే దానిపెళ్ళి కావడం వల్లా ఉద్యోగం దక్కలేదు. పెండ్లి నిలవలేదు." అంది దీర్ఘ నిట్టూర్పును వదులుతు.

' అదేమి ' అన్నట్టు ఆరాగ చూసిండు.

" మావారికి రావలసిన మొత్తం ఒకేసారి వచ్చినయి. తిని తిరిగే మా అల్లుని కన్ను వాటిమీద పడింది. అంతె నా బిడ్డను నానా బాధలు పెట్టిండు. ఆఖరికి తప్పుడు కేసు పెట్టించి విడాకులు ఇచ్చి పంపించిండు. ఇక నా తోనే వుంటున్నది. బదనాము పాలైనంక ఇక ఆ ఊళ్ళో మేము ఉండలేక ఈ ఊరొచ్చి, ఈ ఇల్లు కొనుకున్నం " అంది రంగనాయకి చేతి వెండి గాజులను కదిలించుకుంటు. అప్పుడు ఆమె కళ్ళల్లో బాధభావం కదిలింది.

" పెన్షన్ డబ్బులు, ఇంట్లో కుట్టు మిషన్ వుంది " అంది ముక్తసరిగా మళ్ళీతానే

" ఈ సారి ముగ్గులపోటిలో మీ అమ్మాయిని పాల్గొనమనండి వెళ్లొస్త " అంటు కదిలి రోడ్డువైపు నడిచిండు. ఇక అప్పటి నుండి రోజు రావు తిరిగొస్తు ఆ ఇంటి వైపు చూసేవాడు. ఆరోజు అలాగే చూశాడు అప్పుడె తలుపులు మూసుకుంటున్నాయి. తలుపులపై నుండి చూపులు వాకిట్లోని ముగ్గుమీద ఆగినయి. ' ఓహో ఏంముగ్గు! ఈ ముగ్గుమీద ఓ శృంగారకావ్యయే రాయొచ్చు అనుకుంటు ' చూస్తువుంటే చూడాలనిపిస్తున్న ఎందుకో

ఎక్కువసేపు అక్కడ వుండలేక రోడ్డు వైపు నడిచింది.

వార్డు మెంబర్ మేరి కౌన్సిల్లో పెట్టిన ప్రతిపాదనలన్ని ఆమోదాన్ని పొందిన నెలరోజుల్లో ఆ వార్డులో అభివృద్ధి పనులు జరిగిపోతున్నయి. మేరి గురించి ఆ వార్డే కాదు అన్నీ వార్డుల్లో చర్చే చర్చ !

ఓ రోజు ఆ ఇంటి ముందు వేస్తున్న ముగ్గుగూర్చి ముచ్చటవచ్చింది.

మేరి రావు మధ్యన ముగ్గు వేసే ముచ్చట వస్తూవుండేది. నిప్పులో పొగదాగి వున్నట్టు మనిషిలో కోరికలు వుంటాయి. అవి రకరకాల రూపాల్లో బయటికొస్తువుంటాయి. వాటి రూపాంతరమే ఆ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు. ఎట్టయితినేం మేరి రావు గారికి చాలా దగ్గరైంది. పర్సనల్ విషయాల ప్రస్తావన కూడా వాళ్ళిద్దరి మధ్య వస్తూవుండేది.

ఒకరోజు తన మనస్సులోని కోరిక వెలిబుచ్చిండు రావు. మేరి ముసిముసిగా నవ్వుతు 'సరె' అంది.

" బాబు హాస్టల్లో వుంటున్నడా " అని అడిగింది. ఆయన కో కొడుకున్న విషయం గుర్తొచ్చి.

" అసలు మేడం ఎలా పోయిందండి " అని అడిగింది మేరి.

" అదే బాబు పుట్టుకలో ధనుర్ వాతం వచ్చింది. అప్పుడు ఇన్ని వైద్య సదుపాయలు లేవు. పేదరికం మందులు అందక మట్టి పాలైంది నన్ను ఒంటరిని చేసి పోయింది." అన్నడు విచారంగా.

" ఎంత పనోళ్లు వున్నా తల్లిలేని లోటులోటే గదా "

ఆమె పోయిన్నుండి ఆరోగ్యంలో చాలా మార్పులు వచ్చినయి. ఎంతైనా ఇల్లాలు లేని ఇల్లు. అప్పుడు ఆయనకు దుఃఖం తన్నుకొచ్చింది.

' అంతెకదా ' అన్నట్టు చూస్తు " అన్నింటటికి ఆ ప్రభువు చిత్తమె. అన్నీ ఆయన మేరిసికి వదిలేసి మన ప్రయాణం మనం సాగిస్తునేవుండాలి. నిర్ణయం ప్రభువుదే! ఇక నేను మళ్లీ కలుస్త సార్ " అంటు లేచింది మేరి.

వార్డు మెంబర్ మేరి తన వార్డుకు రంగారావు ఇంటికి పక్కారోడ్డు వేయించింది, రాకపోకలు జరిపించి, మాట మంతి కల్పించి, తన మాటనేరవేర్చుకుంది. ఓ రోజు సాయంత్రం మున్సిపల్ పార్కులో ఛైర్మన్ హోదాలో నగర ప్రముఖులకు విందు జరిగింది. రంగనాయికి కళ్లలో

కాంతి మెరిసింది, ఆనంద బాష్పాలు రాలుతుండగ తన కూతురు నివాసం మారింది.

శ్రీ రాకతోరంగారావు ఇల్లు కళకళలాడింది.

ఆరాత్రి పడకగదిలో కైకతో " అవును నీవు వాకిట్లో వేస్తు వచ్చిన ముగ్గు మతులబ్ ఎంటో చెప్పవైతివి " అని అడిగిండు. ఆమె కళ్లలోకి చూస్తు రావు.

" అది మనస్సుకు సంబంధించింది. మనసులోని వన్నీ బయటకు చెప్పలేముకదా ? మీకైతే అర్ధమైంది కదా"? అంది కళ్ళల్లో కదిలే సిగ్గును దాచె ప్రయత్నం చేస్తు

'అయిందనుకో ' అంటు తలాడించాడు.

రంగనాయకి వచ్చి బిడ్డ దగ్గరే వుంటున్నది.

కాలం సజావుగ నడుస్తూవుంది. ఆడదాని అండలో పురుషుడు కొండైనా బాకగలడు కదా శాసనసభ ఎన్నికలు వచ్చాయి. నగర పాలన నుండి శాసన సభ్యునిగా ఎన్నిక కావడం జరిగింది. శాసనసభ్యునిగా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తు వచ్చాడు. అటు ప్రజల్లో ఇటు పార్టీలోను ఓ పటిష్టమైన స్థానాన్ని నిలబెట్టుకొని వరుసగా రెండు సార్లు శాసన సభ్యునిగా గెలుస్తు వచ్చాడు. రావు గారి రాజకీయ విజయాల వెనక ఆయన శ్రీమతి కైక సహాకారం వుంటు రావడమే కాక ఆమె మహిళ విభాగాన్ని చూస్తు ఓట్లు చీలకుండా, పార్టీపడిపోకుండా కాపాడుకువస్తుంది. అంటె విద్యుత్‌లో మైనస్ ప్లస్ కలిసి శక్తి వచ్చినట్టుగ పార్టీ పటిష్ఠం అవుతు వచ్చింది.

" ఒక రోజు కైక అమ్మ నా గురించి ఏమనుకుంటున్నరే" అని అడిగింది కుతుహలంగా. ఇద్దరు సాయంత్రం వేళ దాబా మీద కూర్చుని చల్లని బీరు తాగుతు.

" అంతా నీతోనే నడుస్తున్నది అంటున్నరు." అంది తల్లి నిండు గ్లాసును కాలీజేస్తు.

" మరి అంతే కదా. నేను లేంది ఆయన ఏంచేయలేడు?" అంది తాను గ్లాసును మళ్ళీ నింపుతు. పని మనిషి వేంచిన కాజు పలుకుల ప్లేట్‌ను పెట్టి పోయింది.

" మరి నిన్నేందుకు జిల్లా మహిళా అధ్యక్షురాలు చేయక మేరినే ఎందుకు చేసినట్టు " అంది రంగనాయకి. కాలీ అయిన గ్లాసును మళ్ళీ నింపుతు.

" అదే అర్థంకాని ప్రశ్న." అంది మీత్తు ఎక్కుతున్న కళ్ళతో.

" ఆయనకెందుకు అంత ఇది ఆ మేరి మీద " అని అంది రంగనాయకి.

" దాని మీద ఏముంటది. అదో కర్రెకాకి " అంది కైక ఆ మాటలో ఈసడింపు ధ్వని ఉంది.

" ఏమో గాని మొన్న మంత్రి  గారొచ్చినపుడు మనింట్ల డిన్నరాయె కదా? దానిది  చెప్పలేని ఆరాటం. చూడలేని కులుకులు." అంది వెటకారంగ.

" ఇది తెలుసా, నేను మినిష్టర్ కారులో వెలతానండి. అంటె ఈయన గూడా సరె' అని తలాడించిండు. అంతె అది వెళ్ళి మినిష్టర్ గారి ప్రక్కన ఎంచక్క కూర్చుంది." అంటు ముక్కు మీద వేలేసుకుంది.

" ఆయన ఏం అనలేదు " అంది మళ్ళీతానె గ్లాసును కాలిచేస్తు.

" ఎందుకంటడు ప్రక్కన కూర్చుంటె ఎచ్చగున్నాలే!"  అంది రంగనాయకి కొంగు భుజం చుట్టు కప్పుకుంటు. నిశా కనురెప్పలను కదలనీయటం లేదు. మాటలు తడబడుతున్నయి.

" ఆయన, ఆయన అస్తమానం ఆయనే !నీ గురించి కూడా కొంచెం ఆలోచించుకో." అంటు మేడ మీది నుండి సోలుతు కిందికొచ్చిండు.

*

కైక ఇంకా హాస్పిటల్లో కోమాలోనే వుంది. భర్త చావుకూడ చూడలేకపోయింది. మరునాడు పత్రికలు, టివి చానల్స్ చావు వార్తను చాటినయి కాని ఎట్లా చచ్చింది ఎవరు చెప్పలేదు.

ఆచావు ఓ మిస్టరీ అని పోలీసు వర్గాల తర్జన భర్జనలో అదట్టా వుండి పోయింది.

అజాత శత్రువుననుకొని 'గన్‌మెన్ వద్దనడమె' ఆయనకు శాపమైంది. కొడుకు అమెరికాలోనే వుంటున్నడు. ఆయనకు రాజకీయ అనుభవం లేదు. ఇంతో అంతో ఆయన భార్య అప్పుడప్పుడు పార్టీలో పనిచేస్తు వచ్చింది.

పార్టీ పెద్దలు దహనక్రియ తరువాత హాసుపత్రికి వెళ్లి అదే విషయాన్ని

చూచాయగ ప్రకటించి వెళ్ళారు. మరునాడు మీడియాలో ఆమె పేరు మారుమోగింది. అది విన్నకైక కళ్ళు తెరిచి చూస్తూ అవసరాలు అడగడానికి సైగలు చేస్తుంది కాని మాట్లాడడం లేదు. ఆమె కళ్ళలో ఆనాటి రాత్రి కదిలింది.

తన భర్త తనమీద కొచ్చిన మనుషులను తప్పించుకోవడానికి పడకగదిలో కొచ్చి విషయం చెప్పాడు. వెంటనే వంటగదిలోకి వెళ్ళమంది. అంతె వెనకనుండి పుచ్చుమీద రోకలిబండ దెబ్బ పడిందంతే. అతను కుప్పకూలిందు. తాను అతని పక్కమ్మటే పడిపోయింది.

ఆ తరువాత గూర్క వచ్చి జనాన్ని పిలించింది తెల్సు. తెల్లవారు జామున తనను ఆసుపత్రికి తరలించిందీ తెలుసూ. ఒక్క తెలవంది ఏమిటి అంటె భర్త తలకు కొరివి పెట్టింది మాత్రమే.

పార్టీ పెద్దల ప్రకటన ఆమెకు స్పృహ తెప్పించింది. ఆమె మాట్లాడుతుంది. తనకేమి తెలవనట్టే అన్నీ అడిగి తెలుసుకుంటుంటె డాక్టరొచ్చి " ఆమెకు అవన్నీ గుర్తు చేయకండి మళ్ళీ స్పృహ తప్పి ప్రమాదముంది. " అంటు ఆమెను ప్రత్యేక గదిలోకి మార్పించారు.

• జనవరి 2005